క్లుప్తంగా

కనకదుర్గమ్మకు ఆషాఢ సారె



ఇబ్రహీంపట్నం:విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారికి పలువురు భక్తులు ఆషాఢ సారె బుధవారం సమర్పించారు. స్థానిక భవానీ భక్త బృందం సభ్యులు చెన్నుబోయిన శ్యామల, తూనుగుంట్ల రమాదేవి ఆధ్వర్యంలో సభ్యులు పసుపు కుంకుమ, గాజులు, నూతన వస్త్రాలు, పళ్లు పలహారాలు తీసుకుని ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ నుంచి ఇంద్రకీలాద్రికి పయనమయ్యారు. అక్కడ అమ్మవారికి సారె సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. భవానీ భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలపై అవగాహన

విస్సన్నపేట: తపాలాశాఖ అందించే అనేక సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగించుకోవాలని గుడివాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ మహ్మద్ ఆసిఫ్ అన్నారు. శ్రీశ్రీ డిగ్రీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం తపాలశాఖ ద్వారా అందించే అనేక సేవలు గురించి అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. తపాలా జీవితబీమా, సేవింగ్ ఖాతాలు, సుకన్యసమృద్ధి యోజన, ఆధార్ నమోదు సవరణ సేవలు, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, రికరింగ్ డిపాజిట్ తదితర సేవలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రజలకు పోస్టల్ సేవలు గురించి తెలపాలన్నారు. కార్యక్రమంలో నూజివీడు పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సురేష్‌కుమార్, ఐపీపీబీ మేనేజర్ కిషోర్‌బాబు, ఎస్‌పీఓఎం రాంబాబు, శ్రీశ్రీ కళాశాల డైరెక్టర్ పూర్ణచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన

గానుగపాడు(తిరువూరురూరల్):విద్యార్థులు చిన్ననాటి నుంచే ఆర్థిక క్రమశిక్షణ అలవరచుకోవాలని గానుగపాడు భారతీయ స్టేట్ బ్యాంకు మేనేజరు నాగేంద్రబాబు నాయక్ సూచించారు. మండలంలోని గానుగపాడు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు బ్యాంకింగ్ వ్యవస్థ పనివిధానం, పొదుపు ఆవశ్యకత గురించి అవగాహన సమావేశం నిర్వహించారు. విద్యార్థులు బ్యాంకు ఖాతా ప్రారంభించి ప్రతినెలా పొదుపు చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు రాంప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి


జి.కొండూరు:వర్షాలు పడుతున్న నేపథ్యంలో పారిశుద్ధ్య చర్యలపై అధికారులు దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి జి. మోహన్ బాబు అన్నారు. మండల పరిధి గడ్డమణుగు గ్రామాన్ని స్థానిక అధికారులతో కలిసి బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను మోహన్ బాబు దృష్టికి తీసుకొచ్చారు. ఆ సమస్యలను సాధ్యమైనంత తక్కువ సమయంలో పరిష్కరించాలని సంబధిత శాఖల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తిరువూరులో ఎన్జీవోల నిరసన



తిరువూరు:వైద్యారోగ్య శాఖలో ఉన్నతాధికారుల వేధింపులు తాళలేక కాకినాడలో సీనియర్ అసిస్టెంటు రాధాకృష్ణ బలవన్మరణానికి పాల్పడిన సంఘటనపై తిరువూరు తాలూకా ఎన్జీవో సంఘం బుధవారం నిరసన తెలిపింది. తాలూకా యూనిట్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో ఉద్యోగులు ఆందోళన చేశారు. ఉద్యోగులపై అకారణంగా ఉన్నతాధికారుల వేధింపులు ఆపాలని, రాధాకృష్ణ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని సంఘ నాయకులు వాసుదేవరావు, పుల్లయ్య, ప్రకాశరావు, సురేష్, రామారావులు డిమాండ్ చేశారు.

నోటు పుస్తకాలు పంపిణీ



రెడ్డిగూడెం:రెడ్డిగూడెంలోని ఎస్సీ కాలనీ, నక్కలగూడెంలో ఎంపీపీ స్కూలు విద్యార్థులకు బుధవారం నోట్ పుస్తకాలు, విద్యా సామగ్రిని అందజేశారు. ఫ్రెండ్స్ సర్వీసు సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర రజక హక్కుల జన సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జేటీ రాజేంద్ర ప్రసాద్ పాల్గొని నోటు పుస్తకాలు, పెన్సిల్స్, షార్పనర్స్, ఎరైజర్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ పి.రమేష్ మాట్లాడుతూ దాతలు అందించే సహకారం ఎంతో గొప్పదన్నారు. రిటైర్డ్ అధ్యాపకులు జయరాజు, ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఫ్రెండ్స్ సర్వీసు సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షుడు చాట్ల విజయ్‌కుమార్, కార్యదర్శి మట్ట అన్నామణి పాల్గొన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు

ఆగిరిపల్లి: స్థానిక రజక వీధిలో 20 రోజుల నుంచి వీధి దీపాలు వెలగడంల లేదని మంగళవారం సాక్షిలో ప్రచురించిన కథనం విదితమే. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ ఆధ్వర్యంలో వీధిలైట్లకు మరమ్మతులు చేసి వెలిగించారు.

బాల్య వివాహాలు భవితకు అవరోధాలు



మాట్లాడుతున్న కమిషనర్ శంకర్‌నాయక్



అవగాహన ప్రదర్శనలో డ్వామా పీడీ, అధికారులు, విద్యార్థినులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం):బాల్యవివాహాలు బాలల భవితకు అవరోధాలుగా మారతాయని, అధికారుల సమన్వయంతో అరికట్టాలని మున్సిపల్ కమిషనర్ వై.శంకర్‌నాయక్ అన్నారు. కొండపల్లి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 2006 బాల్య వివాహాల నిర్మూలన చట్టంపై బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలు, అరికట్టడంలో తల్లిదండ్రుల పాత్రపై అవగాహన కల్పించారు. బాలికలకు 18, బాలురకు 21 ఏళ్ల వయస్సులోనే వివాహాలు చేయాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో పుష్పలత బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. బాల్యంలో వివాహాలు జరిగితే ఎదురైయ్యే అనారోగ్య సమస్యల గురించి వివరించారు. డీసీపీవో దుర్గాప్రసాద్, సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు. గుంటుపల్లి జెడ్పీ పాఠశాలలో ఎంపీడీవో ఉమాదేవి మాట్లాడుతూ బాల్యవివాహాలు సాంఘిక దురాచారమన్నారు. గ్రామాల్లో సమస్యలు ఎదురైతే హెల్ప్‌లైన్ 1098, 100, 108 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

జి.కొండూరు:బాల్య వివాహాలు చేయడం వల్లన ఆడపిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ శాఖ అధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన, బాలికల హక్కులపై జి.కొండూరు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థినులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ మాట్లాడుతూ ఆడపిల్లలు చదువుకొని ఉన్నత స్థానానికి చేరిన తర్వాతే వివాహం చేసుకోలని సూచించారు. బాల్య వివాహాలు చేసేవారు ఎటువంటి వారైనా సరే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలికల హక్కులు, చట్టాలపై మండల ప్రత్యేక అధికారి జి.మోహన్‌బాబు విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, సీడీపీఓ పుష్పలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు అన్నమ్మ, జోజి పాల్గొన్నారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి

తిరువూరు: సమాజంలో పలు రకాల వ్యక్తులుంటారని, బాలికలు అప్రమత్తంగా వ్యవహరించి చెడు వ్యక్తులకు దూరంగా ఉండాలని తిరువూరు మండల ప్రత్యేకాధికారి, జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సునీత సూచించారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో బుధవారం బాల్య వివాహాల నిషేధం, భేటీ బచావో-భేటీ పడావో, లైంగిక వేధింపు నిరోధక చట్టాలపై స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడే వారిని శిక్షించడానికి కఠిన చట్టాలు అమల్లో ఉన్నాయని తెలిపారు. అనంతరం బాల్య వివాహాల నిరోధంపై జరిగిన అవగాహన ప్రదర్శనలో తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సత్యవతి, సూపర్‌వైజర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.



బాలికల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ, అధికారులు



రామానగరంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి పెద్దిబాబు

విస్సన్నపేట: బాల్య వివాహాలు వలన అనేక నష్టాలున్నాయని మండల ప్రత్యేకాధికారి, ఫిషరీస్ డీడీ వి.పెద్దిబాబు తెలిపారు. మండలంలోని పుట్రేల జిల్లా పరిషత్ హైస్కూల్‌ను బుధవారం ఆయన సందర్శించారు. బాల్య వివాహాలతో జరిగే ప్రమాదాల గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం రామానగరంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. మండలంలోని కొండపర్వ గ్రామంలో వైద్యారోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ కుమారి, ఎంఈఓ సుధాకర్, ఈఓపీఆర్డీ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

నేడు గ్రామాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు

నూజివీడు: మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 25న ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ శిబిరాలను ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. తూర్పుదిగవల్లి, ముక్కొల్లుపాడు, పోతురెడ్డిపల్లి, గొల్లపల్లి-1, గొల్లపల్లి-2 సచివాలయాల్లో ఆధార్ శిబిరాలను నిర్వహిస్తామని చెప్పారు. ఈ శిబిరాల్లో ఆధార్‌లో అడ్రస్ మార్పు, బయోమెట్రిక్ అప్‌డేట్, పేరులో సవరణలు, చిన్నపిల్లలకు నూతన ఆధార్, తదితర సేవలను అందిస్తారన్నారు. ఆధార్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆధార్ నమోదుకు ప్రత్యేక కేంద్రం....

తిరువూరురూరల్:మండలంలోని ముష్టికుంట్లలో గురువారం ఆధార్ నమోదుకు ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. ఈ కేంద్రంలో ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు, చిరునామా మార్పు తదితర లావాదేవీలు నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు. ముష్టికుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కూడా ఈ కేంద్రం కొనసాగుతుందన్నారు.

ఇంజినీరింగ్ తరగతులు ప్రారంభం

తిరువూరు:స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఈఏపీసెట్ ద్వారా తమ కళాశాలకు 480 మంది విద్యార్థులను కేటాయించిందని పేర్కొన్నారు. సీఎస్ఈ, ఏఐఎం, డేటా సైన్స్ కోర్సులలో అన్ని సీట్లు భర్తీ అయ్యాయని ఆయన వెల్లడించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుహాసిని



గ్రామస్తులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి సుహాసిని

రెడ్డిగూడెం:ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. సుహాసిని తెలిపారు. రెడ్డిగూడెం మండలం నాగులూరు ఎస్సీ కాలనీని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సుహాసిని మాట్లాడుతూ వర్షాలు ముమ్మరంగా కురుస్తున్న నేపథ్యంలో మలేరియా, డెంగీ, చికెన్ గునియా తదితర రోగాలు వ్యాపిస్తున్నాయని తెలిపారు. కలుషిత నీరు, ఆహార పదార్థాల ద్వారా అతిసారా టైఫాయిడ్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా రెడ్డిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది కాలనీలోని కొన్ని ఇళ్లకు తిరిగి లార్వాను తొలగించారు. ఇంటింటికి తిరిగి జ్వరాల సర్వే, దోమకాటు వల్ల వ్యాధులు, ఆరోగ్య, విద్య గురించి స్థానికులకు తెలియజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సందేష్, మలేరియా సబ్ యూనియన్ ఆఫీసర్ వలి, ఎంపీడీఓ ఆశీర్వాదం, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్, హెల్త్ అసిస్టెంట్‌లు, ల్యాబ్ టెక్నీషియన్, ఎంఎల్‌హెచ్‌పీ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు పాల్గొన్నారు.

రసాయన ఎరువులతో భూసారానికి దెబ్బ



మాట్లాడుతున్న మాధవీలత, చిత్రంలో మోనీషా, సంధ్యారాణి, శ్రీనివాసరావు తదితరులు

మైలవరం:అవసరం మేరకు ఎరువులు వాడుకోవాలని, రసాయన ఎరువులు మోతాదుకు మించి వాడటం వలన భూసారం దెబ్బతిని వాతావరణ కాలుష్యం అవుతుందని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ మాధవీలత తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం విజయవాడ ఆధ్వర్యంలో విత్తనాన్ని సొంతగా తయారు చేసుకునే పద్ధతులపై బుధవారం అవగాహన కల్పించారు. అదే విధంగా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) మైలవరం మండలంలోని మైలవరం, చంద్రగూడెం గ్రామాలలో ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతిపై అవగాహన, భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వాడకంపై అవగాహన కల్పించారు. మైలవరం, చంద్రగూడెం గ్రామాల్లో రైతులతో కలిసి క్షేత్ర సందర్శన చేశారు. చిరుపొట్ట దశకు ముందే కేళీలు ఏరివేయడం, కలుపు లేకుండా చూసుకోవడం ద్వారా విత్తన స్వచ్ఛతను కాపాడుకోవచ్చని వివరించారు. జనుము, జీలుగ వంటి వాటిని భూమిలో వేయడం ద్వారా భూసారం పెరిగి సేంద్రియ కర్బనం అందుబాటులో ఉంటుందన్నారు. వేప, గానుగ తదితర ఆకులతో చేసిన కషాయాన్ని పిచికారీ చేసి చీడపీడలను నివారించవచ్చని సూచించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల సరళిని మార్చుకోవాలని చెప్పారు. వరిలో నారుమడి, పత్తి, పచ్చిరొట్ట పైర్లు పరిశీలించారు. ఏడీఏ, డీఆర్‌సీ మోనీషా, మైలవరం డివిజన్ ఏడీఏ(ఆర్) ఎం.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి కె.సంధ్యారాణి, వీఏఏ టి.శ్రావ్య, ఏఓ(టెక్నికల్) ఆర్.వాసుదేవ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడు రఘువంశీకి అభినందనలు

మైలవరం ఎల్బీఆర్సీఈ అధ్యాపకునికి పీహెచ్‌డీ ప్రదానం



రఘువంశీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

మైలవరం: లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకునికి పీహెచ్‌డీ ప్రదానం జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు బుధవారం తెలిపారు. అధ్యాపకులు వై. రఘువంశీ ఎస్ఐటీ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో డాటా డ్రివెన్ అప్రోచెస్ ఫర్ అన్‌సర్టినిటీ ఇష్యూస్ ఇన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్-స్టేట్ ఎస్టిమేషన్ అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు చెప్పారు. ఈ పరిశోధన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్ తీపర్తి, ఎస్ఐటీ ఆంధ్రప్రదేశ్, తాడేపల్లిగూడెం పర్యవేక్షణలో జరిగిందన్నారు. కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జె.శివవర ప్రసాద్, అధ్యాపకులు రఘువంశీని అభినందించారు.

ఎంఈఓ-2పై ఆర్డీవోకు ఫిర్యాదు



ఎంఈఓ-2పై ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

ఏ.కొండూరు:ఉపాధ్యాయులను ఇబ్బందులు గురి చేస్తున్న ఎంఈఓ-2పై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం తిరువూరు ఆర్డీకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎంఈఓ-2 ఈఎల్ కేశవరావు పాఠశాలలు తనిఖీ చేసే సమయంలో సరైన సూచనలు ఇవ్వకుండా ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా అప్పటికప్పుడు గ్రూప్ కాల్ చేస్తూ గ్రూప్లో లేని ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. పాఠశాలలు తనిఖీ సమయంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు ఉంటే వారిని బెదిరిస్తూ మీపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఒత్తిడికి గురి చేస్తున్నట్లు వాపోయారు. కార్యాలయంలో కూర్చొని మీరు పాఠశాలల్లో ఉన్నారా లేదా అని వాట్సప్ గ్రూపుల్లో సెల్ఫీస్ పెట్టమని చెబుతున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎంఈఓ కార్యాలయానికి వెళ్లితే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఇబ్బందులకు గురి చేస్తున్న ఎంఈఓ-2 వల్ల ఉద్యోగం చేయటం కష్టంగా మారిందన్నారు. ఆయన తప్పించి మరొకరిని నియమించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బాలికల వసతి గృహం తనిఖీ



తిరువూరు: ఆర్డీవో మాధవి రాజుగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. తిరువూరులోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో మరుగుదొడ్లు, మంచినీటి వసతిపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. మెనూ గురించి వార్డెన్ వివరించారు.

28 నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం):శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షులు, యోగా గురువు లంకే జనార్ధన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండపల్లి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఉదయం సాయంత్రం రెండు పూటల జరిగే శిక్షణలో సూక్ష్మ వ్యాయామాలు, సూర్యనమస్కారాలు, ప్రాణాయామం, ముద్రలు, బంధాలు, ధ్యాన పద్ధతులు, యోగ నిద్రతో పాటు యోగాసనాలపై శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తిగల వారు 63014 54859 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

27న మైలవరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

మైలవరం: మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో గ్రామ పంచాయతీ సహకారంతో ఈ నెల 27న ఉచిత అధునాతన మెగా వైద్య సేవా శిబిరం నిర్వహించనున్నట్లు ఆయాన్ ఐ హాస్పిటల్ గౌరవ అధ్యక్షులు వావిలాల రజనీకాంత్ శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ అయాన్ ఐ హాస్పిటల్ చీఫ్ డాక్టర్ బషీర్ అహ్మద్ మయాఖ్ పాల్గొని శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కంటికి సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఉచితంగా మందులు, ఐ డ్రాప్స్ అందజేస్తారన్నారు. శస్త్ర చికిత్సలు, కళ్ళజోళ్ళు, అవసరమైన రోగులకు అయాన్ ఐ హాస్పిటల్ విశేష రాయితీలు ఇచ్చి సహాయం చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని మైలవరం పంచాయతీ కార్యాలయం సిబ్బంది, కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు, స్థానికులు, పరిసర గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అసమానతలపై పోరాడిన గుర్రం జాషువా



కొండపల్లి(ఇబ్రహీంపట్నం):సమాజంలో వేళ్లానుకుపోయిన అసమానతలపై మహాకవి గుర్రం జాషువా కలంతో పోరాడారని ప్రముఖ రచయిత అనిల్ డ్యానీ అన్నారు. కొండపల్లిలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గుర్రం జాషువా 53వ వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివక్షని ఎదుర్కొనేందుకు సాహిత్యాన్ని అస్త్రంగా మార్చుకుని అనేక రచనలతో ప్రజల్లో సామాజిక చైతన్యం నింపారని కొనియాడారు. ప్రభుత్వం, ప్రజా సంఘాల ద్వారా ఎన్నో పురస్కారాలు, బిరుదులు అందుకున్నట్లు చెప్పారు. జాషువా సాంస్కృతిక వేదిక సభ్యుడు డీపీ రాజు, ఎంఈవో పుష్పలత, జేవీవీ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు వి.మురళీమోహన్, కామేశ్వరరావు, మాజీ సర్పంచ్ అమ్మాజీ, మస్తాన్‌వలి, ఎస్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం



ఏ.కొండూరు:మండలంలోని చీమలపాడు గ్రామంలో తాజుద్దీన్ బాబా జెండా గంధ మహోత్సవాన్ని చీమలపాడు, విజయనగరం దర్బార్ల పీఠాధిపతులు మొహమ్మద్ ఖాజా మొహీయుద్దీన్ షా తాజ్ ఖాదరి, మహమ్మద్ ఖలీల్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఉల్లాసంగా ఆటపాటలు



కాచవరం(ఇబ్రహీంపట్నం):కేంద్ర విద్యా విధానం 2020 వార్షికోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న శిక్ష సప్తాహ్ కార్యక్రమం కాచవరం ఎంపీపీ పాఠశాలలో ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. మూడోరోజు బుధవారం ఉల్లాసంగా క్రీడా దినోత్సవం జరిగింది. హిందీ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషా నేతృత్వంలో బాలబాలికలు ఆటపాటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. మానసిక, శారీరక ఆనందానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. క్రీడల ప్రాముఖ్యత వివరించారు. హెచ్‌ఎం నాగమల్లేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఢిల్లీ ధర్నాలో స్వామిదాసు



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సాగిస్తున్న దమనకాండకు నిరసనగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వైఎస్సార్ సీపీ అధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ధర్నా సందర్భంగా ఆ పార్టీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌దార్జి నల్లగట్ల స్వామిదాసు మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన చిత్రమిది. –తిరువూరు

క్షీరబంధు పథకం చెక్కులు పంపిణీ

రెడ్డిగూడెం:కృష్ణా మిల్క్ యూనియన్‌లో పాలు పోసి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కృష్ణా మిల్క్ యూనియన్ బోర్డు డైరెక్టర్ ఉయ్యూరు ఆంజిరెడ్డి తెలిపారు. మైలవరం క్లస్టర్ పరిధిలోని నరుకుళ్ళపాడు ఎంపీఏలో పాల ఉత్పత్తిదారుడు కట్టా ఆదామ్ ఇటీవల మరణించడంతో కృష్ణా మిల్క్ యూనియన్ ద్వారా క్షీరబంధు పథకం కింద రూ. 50 వేల చెక్కును ఆదామ్ కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. టీడీపీ నాయకులు కె. విజయబాబు, మైలవరం క్లస్టర్ మేనేజర్ కె.వెంకటేశ్వరరావు, శ్యామ్ సుందర్, సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

కోటపాడులోని...

చాట్రాయి: మండలంలోని కోటపాడులోని పాల సంఘంలో పాలు పోస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ చెలికాని ఉషారాణి భర్త భాస్కరావు ఇటీవల మృతి చెందారు. బుధవారం కృష్ణా మిల్క్ యూనియన్ తిరువూరు పాల శీతల కేంద్ర మేనేజర్ టి.సాంబశివమూర్తి మృతుడి కుటుంబానికి క్షీర బంధు పథకం కింద రూ.50 వేల చెక్కుని అందజేశారు. కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి పరిశీలన



తిరువూరు:ఏరియా ఆసుపత్రిని మండల ప్రత్యేకాధికారి సునీత బుధవారం సందర్శించారు. ఆపరేషన్ థియేటర్, ప్రసూతి వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడారు. ప్రభుత్వాసుపత్రుల్లో గర్భిణులకు కల్పిస్తున్న వైద్యసేవలు మరింత మెరుగుపరచాలని ఆదేశించారు. అత్యవసర వైద్యసేవలను అందుబాటులో ఉంచాలని సూచించారు. పరిసరాల శుభ్రతతో పాటు రక్షిత మంచి నీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. మధిరరోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి బాలల బరువు పరిశీలించారు. ప్రీ స్కూల్ కార్యకలాపాలపై అంగన్‌వాడీ సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి పారిశుద్ధ్య పరిస్థితులపై సమీక్షించారు.

అసెంబ్లీ కార్యక్రమాలు వీక్షించేందుకు అవకాశం



అసెంబ్లీ సమావేశాలు వీక్షించడానికి వెళుతున్న విద్యార్థులు

మైలవరం:డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అసెంబ్లీ కార్యక్రమాలు వీక్షించడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు 50 మంది బుధవారం రాష్ట్ర అసెంబ్లీ కార్యక్రమాలను వీక్షించారు. ఆ సమయంలో ప్రశ్నోత్తరాల కార్యక్రమం జరుగుతుందని, సభ్యులు అడిగే ప్రశ్నలకు సంబంధిత శాఖ మంత్రులు ఇచ్చే సమాధానాలు ప్రత్యక్షంగా చూడటం వారిలో ఉత్సాహాన్ని, ఆనందాన్ని నింపిందని తెలిపారు. అదే విధంగా అసెంబ్లీ కార్యకలాపాలపై విద్యార్థులకు అవగాహన కలిగిందన్నారు. కళాశాల రాజనీతి అధ్యాపకులు పురంశెట్టి రంగారావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఇటువంటి అవకాశం కల్పించిన ప్రభుత్వానికి, సహకరించిన కళాశాల విద్యా శాఖ కమిషనర్, ప్రిన్సిపాల్‌కు అభినందనలు తెలిపారు. వ్యాయామోపాధ్యాయులు మేజర్ మన్నే స్వామి, ఇంగ్లీష్ అధ్యాపకురాలు బి.సుభాషిని, ప్రిన్సిపాల్‌ను అభినందించారు.

40 మందికి ఆధార్ సవరణ

ముసునూరు: 40 మందికి సంబంధించిన ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్ చేసినట్లు ఎంపీడీవో సీహెచ్ పద్మావతీదేవి తెలిపారు. గోపవరం-1, 2, కాట్రేనిపాడు గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రజలకు గోపవరం-2 సచివాలయంలో బుధవారం ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో 40 మందికి సంబంధించి నూతన ఆధార్ నమోదు, సవరణలు చేసినట్లు చెప్పారు. గురువారం ముసునూరు-1, 2, చింతలవల్లి, కొర్లగుంట గ్రామ సచివాలయాల పరిధిలోని వారికి ముసునూరు-2 గ్రామ సచివాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్యాంపు నిర్వహిస్తారన్నారు. శిబిరంలో ఆధార్ నూతన నమోదు, ఆధార్ బయోమెట్రిక్ సవరణలు, 0-5 పిల్లలకు నూతన ఆధార్ నమోదులు చేయించుకోవచ్చని తెలిపారు.